క్లుప్తంగా

వ్యక్తిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం: ఇంటి హద్దుల విషయమై పేరం కామిరెడ్డి అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వీర ప్రతాప్ కథనం మేరకు గాంధీనగర్‌కు చెందిన పేరం కామిరెడ్డి, ఆవుల గీతాలక్ష్మి మధ్య ఇంటి స్థల హద్దుల విషయంలో గత కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ విషయంపై గురువారం ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరగడంతో గీతాలక్ష్మి రేకుతో కామిరెడ్డిపై దాడి చేసి గాయపరిచింది. అలాగే గీతాలక్ష్మి కుమారుడు వంశీకృష్ణ కూడా రాయితో కామిరెడ్డిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు కామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగదును దోచుకున్న ఇద్దరి అరెస్ట్

నెల్లూరు సిటీ: నగదును దోచుకున్న ఘటనలో ఇద్దర్ని చిన్నబజార్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలు.. హరనాథపురానికి చెందిన వెంకటేష్ ఎం – 1 థియేటర్స్ రోడ్డులో బుధవారం వెళ్తుండగా, లోకే ష్, ప్రసన్నకుమార్ అడ్డుకొని నగదును దోచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సైదులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. బీవీనగర్‌కు చెందిన మిథున్‌బాబు గూడూరులోని పంచాయతీ రాజ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ తన బైక్‌పై వేదాయపాళెం రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడే బైక్‌ను నిలిపేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరి తొమ్మిదిన బైక్‌ను అక్కడ పార్క్ చేసి విధులకెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ మాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): మాగుంట లేఅవుట్లోని సన్నిధి కార్యాలయంలో శ్రీరామనవమిని సన్నిధి ప్రచురణల సంస్థ అధినేత భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్నిధి ప్రతిభ పురస్కారాలను పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు వెంకటప్పయ్య, ప్రభాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంగీత, సాహిత్య సమ్మేళనం



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్ రోడ్డులో నిన నర్సరీలో సంగీత, సాహిత్య సమ్మేళనాన్ని గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక అధ్యక్షురాలు సుభద్రాదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలను చేపట్టారు. రామ దాసు, త్యాగరాజ కీర్తనలు, రామచంద్రమూర్తిపై భక్తిగీతాలను ఆలపించారు. హాజరైన వారిని సత్కరించి పూల మొక్కలను అందజేశారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : ట్రాక్టర్‌ను ఆటో ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో గురువారం జరిగింది. కనుపర్తిపాడు వైపు నుంచి గొలగమూడి వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఎదురుగా వచ్చిన ఆటో గొలగమూడి సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మణెమ్మ, వెంకటయ్యలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబాపురంలో ఆక్రమణల తొలగింపు

నెల్లూరు రూరల్: అంబాపురంలో ఆక్రమణలను రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో గురువారం తొలగించారు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో దళితులు, మరో వర్గానికి చెందిన వారు ఆక్రమించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆర్డీఓ మలోల, రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బయ్య, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, తదితరులు ఈ ప్రాంతానికి చేరుకున్నారు. వాగ్వాదం అనంతరం ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడారు. సదరు స్థలం ప్రభుత్వానికి చెందిందని, ఇందులోకి ఎవరూ ప్రవేశించకూడదని స్పష్టం చేశారు. ఆక్రమణదారులు తమ సామగ్రిని తీసుకెళ్లారు.

12 మంది అరెస్ట్

నెల్లూరు సిటీ: అంబాపురం పరిధిలోని ప్రభుత్వ స్థలం వద్ద ఆక్రమణలకు యత్నిస్తున్న 12 మందిని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో వాడవాడలా ఉన్న రామాలయాల్లో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వాములకు అభిషేకాలు, విశేష అలంకరణ, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరిపారు. గ్రామోత్సవాల్లో భక్తులు స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- కనులపండువగా కల్యాణోత్సవాలు, గ్రామోత్సవాలు



కొడవలూరు: నార్తురాజుపాళెం రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని పంచేడు గ్రామంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ, కోదండరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ కల్యాణోత్సవం కనులపండువగా జరిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరా శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ సూరా ప్రదీప ఉభయకర్తలుగా వ్యవహరించి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

ఉత్సాహంగా శోభాయాత్ర

శ్రీరామనవమిని పురస్కరించుకుని హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెంలోని వీధుల్లో బైక్‌లపై యువత ఉత్సాహంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 200 బైక్‌లపై యువత ఈ యాత్రను చేపట్టారు. స్థానిక కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీరాముడి చిత్రపటాలు, కాషాయ జెండాలను చేతబట్టిన యువత నినాదాలు చేస్తూ యాత్రను కొనసాగించారు.

వైభవంగా..

ఇందుకూరుపేట: శ్రీరామనవమి పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రామాలయాల్లో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వాములకు విశేష పూజలు, అనంతరం గ్రామోత్సవాలు నిర్వహించారు. ఇందుకూరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురజాల జ్ఞాన స్వరూప్(బుజ్జిబాబు) – కల్యాణి దంపతులు, పుష్పగిరి వెంకటలక్ష్మీనరసింహప్రకాశం ఉభయదాతలుగా వ్యవహరించారు. కొత్తూరులోని శ్రీరామమందిరంలో అర్చకుడు రంగబాబుస్వామి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. స్థానికులు కైలాసం శ్రీనివాసులురెడ్డి – లావణ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. నరసాపురం రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

నార్తురాజుపాళెంలో..

కొడవలూరు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నార్తురాజుపాళెం రామాలయంలో ఉదయం ఆలయంలో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వాములకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని అర్చకులు వేడుకగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చకులు సీతారాముల కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు రాములోరి కల్యాణాన్ని తిలకించి తరించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

ముత్తుకూరు: శ్రీరామనవమి పర్వదిన వేడుకలు గురువారం మండలంలోని పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముత్తుకూరు, పంటపాళెం, కృష్ణపట్నం, పొట్టెంపాడు, మామిడిపూడి, పిడతాపోలూరు, మునునూరువారిపాళెం, డమ్మాయపాళెం, నారికేళపల్లి, గోపాలపురం గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాలను వివిధ పుష్పాలు, విద్యుద్దీప తోరణాలతో అలంకరించారు. ఆలయాల్లో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

రామాలయాల్లో..

మనుబోలు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనుబోలులోని నాలుగు రామాలయాలతోపాటు కొమ్మలపూడి, చెర్లోపల్లి, కొండూరుసత్రం, పిడూరు, యాచవరం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల విగ్రహాలకు అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, విశేష పూజలు చేశారు. కోదండరామపురంలోని ఆలయంలో జరిగిన పూజలకు వేమూరి శ్రీనివాసులు – సుజన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

షిర్డీసాయిబాబా మందిరంలో..

పొదలకూరు: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. నగర సంకీర్తనతో భక్తులు పురవీధుల్లో పర్యటించారు. భక్తులు పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా నోటి తిరుపతిరెడ్డి–లక్ష్మీకుమారి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో మందిర సేవా సమితి బాధ్యులు పాల్గొన్నారు. అలాగే విశ్వ హిందూ పరిషత్ బాధ్యులు స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులు, ప్రజలకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి సందర్భంగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా స్థానిక శ్రీరామ మందిరంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గీతామందిరంలో..

స్థానిక గీతామందిరంలో శ్రీరామనవమి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఉభయకర్తలు అనిశెట్టి వెంకటేశ్వర్లు – భానుకుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం స్వామివారికి మేలుకొలుపు, గీతాపారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, కృష్ణభగవానునికి సహస్రనామ పూజ, బంగారుపూలతో అష్టోత్తరం, సామూహిక కుంకుమార్చన, మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన భజన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. మందిర కమిటీ కార్యదర్శి అనిశెట్టి సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బుచ్చిరెడ్డిపాళెం: శోభాయాత్రలో పాల్గొన్న యువత



మనుబోలు: రామాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు



ముత్తుకూరు: కృష్ణపట్నంలో..



ఇందుకూరుపేట: లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం: సీతారాములకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు



పొదలకూరు: బస్టాండ్‌లో ప్రయాణికులకు వడపప్పు, పానకం పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు ఊటుకూరులో గడప గడపకు..

కోవూరు(విడవలూరు): 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం విడవలూరు మండలం ఊటుకూరులో శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిమెంటు రోడ్ల పనులు వేగవంతం

పొదలకూరు: పట్టణంలో సిమెంటు రోడ్ల పనులు వేగవంతంగా చేస్తున్నారు. గురువారం స్థానిక రామమందిరంవీధి ప్రాంతంలో సిమెంటు రోడ్లు నిర్మించే పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు పట్టణం, పంచాయతీ మజరా గ్రామాల్లో మిగిలిపోయిన సిమెంటు రోడ్లను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. ఫలితంగా లింగంపల్లితోపు, తోకంచి పునరావాస కేంద్రం, నర్సారెడ్డికాలనీ, రామమందిరం ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు కోనం చినబ్రహ్మయ్య, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, వార్డు సభ్యులు అనూరాధ, విజయలక్ష్మి, నాయకులు సోమా భాస్కర్, శివప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, రామిరెడ్డి, తుమ్మల ప్రసాద్, హేమంత్, భాస్కర్‌రెడ్డి, వేమారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కొడవలూరు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని నార్తురాజుపాళెనికి చెందిన 'వనమా శేషయ్య, పద్మావతమ్మ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో స్థానిక ట్రస్ట్ కార్యాలయం వద్ద, రామాలయం వద్ద, టపాతోపు విశ్వజనని అనాథాశ్రమాల్లో గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు దొరడ్ల సత్యనారాయణ – లలితమ్మ దంపతులు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేబడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దొరడ్ల శ్రీధర్, వెంకటసుప్రజ, ఉదయ్‌కిరణ్, కాంచన లక్ష్మి, సిద్ధా లక్ష్మీతనూజ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆశ్రమంలో బాలలకు క్విజ్ పోటీలు

కొడవలూరు: మండలంలోని టపాతోపు విశ్వజనని ఆశ్రమంలోని బాలలకు గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆశ్రమంలోని బాలబాలికలను ఏబీసీడీ గ్రూపులుగా విభజించి ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీ–గ్రూపు బాలురు మొదటిస్థానంలో నిలిచారు. వీరికి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి చేతులమీదుగా సైకిల్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమంలోని బాలబాలికలు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ప్రతి నెలా బాలలకు క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యాప్రమాణాలు పెంపొందించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు రాజ్యలక్ష్మి, శ్రీనివాసులు, శ్రేష్ఠ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు హేమంత్‌కుమార్, సభ్యుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల విజేతలకు బహూకరిస్తున్న సైకిల్

రైతు సంక్షేమానికి సొసైటీ కృషి

కోవూరు: మండలంలోని పడుగుపాడు సొసైటీని ప్రారంభించి దాదాపు 102 ఏళ్లు పూర్తయిందని, రైతుల సంక్షేమమే కోసమే ఈ సొసైటీ కృషి చేస్తోందని సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో గురువారం మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఉన్న 10 గ్రామాల్లో రైతులకు అవసరమైన అన్ని రుణాలను అందజేశామన్నారు. కోవూరు, చెర్లోపాళెం వేగూరు, పోతిరెడ్డిపాళెం, పాటూరు గ్రామాల్లో ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములను నిర్మాణం చేపడుతున్నామన్నారు. సొసైటీలో లాకర్ సదుపాయం కలదని తెలిపారు. ఇనమడుగు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. 75సార్లు రక్తదానం చేసిన దేవిరెడ్డి సురేష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, సొసైటీ రాఘవయ్య, బ్యాంకు మేనేజర్ సుధాకర్, డైరెక్టర్లు అంబటి ప్రసాద్, గున్నం జనార్దన్, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పొత్తు లేనిదే పూట గడవదు

కోవూరు: ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడికి పొత్తు లేనిదే పూట గడవదని, అయితే టీడీపీ నాయకులు, ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ గురించి.. తమ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి గురించి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని డీసీఏబీ చైర్మన్ దొడ్లంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీని ఎన్టీ రామారావు ఒక ఆశయంతో ప్రారంభించగా, చంద్రబాబునాయుడు కుట్రలతో ఆ పార్టీని తన పరం చేసుకుని ఎన్టీఆర్‌ను మానసికంగా హత్య చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని, పేద ప్రజలందరూ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. రైతాంగం కోసం పనిముట్లు కొనుగోలు విషయంలో రైతు నచ్చిన కంపెనీని ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే హక్కు టీడీపీ నేతలకు లేదన్నారు. కేవలం టీడీపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకే విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

రామమందిరాల నిర్మాణానికి శ్రీకారం

ప్రతి పల్లెలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా కోవూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 29 రామమందిరాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కృషి చేశారు. ఇకపై దళిత, గిరిజన కాలనీల్లో శ్రీరామనామం మారుమోగనుంది.

- కోవూరు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 29 రామమందిరాలకు టీటీడీ ఆమోదం
- ఎమ్మెల్యే ప్రసన్న కృషితో ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు



దండిగుంట ఎస్సీకాలనీలో రామమందిర నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: ఆధ్యాత్మిక చింతన వెల్లివిరిసేలాగా తిరుమల తిరుపతి దేవస్థానం దళిత, గిరిజన కాలనీల్లో రామాలయాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. కోవూరు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రామమందిరాలను నిర్మించి ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించేందుకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కృషి చేశారు. ఇందులో భాగంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడి ఆలయాల నిర్మాణానికి నిధుల మంజూరుకు చొరవ తీసుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రామమందిర నిర్మాణ పనులను ప్రారంభించారు.

నిధులు మంజూరు

నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 6, కొడవలూరు మండలంలో 6, ఇందుకూరుపేట మండలంలో 8, విడవలూరు మండలంలో 4, కోవూరు మండలంలో 5 చొప్పున రామమందిరాలను టీటీడీ మంజూరు చేసింది. ఒక్కొక్క మందిరం నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున టీటీడీ మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే విడవలూరు మండలం దండిగుంట గ్రామంలోని ఎస్సీకాలనీలో మందిర నిర్మాణ పనులు ప్రారంభం కాగా, మిగిలిన చోట్ల స్థల పరిశీలన చేశారు. త్వరలోనే ఆయా ప్రాంతాల్లో కూడా ఆలయాల నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు.

ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కృషితో నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీలకు 29 రామమందిరాలు మంజూరయ్యాయి. ఇందుకు అవసరమైన నిధులు కూడా మంజూరు చేశారు. ఈ రామమందిరాల నిర్మాణం వల్ల ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందని నమ్ముతున్నాము. ఇప్పటికే మా గ్రామంలో మందిర నిర్మాణ పనులు ప్రారంభించాం. త్వరలోనే పూర్తి చేస్తాం.

– బెల్లంకొండ సుప్రజ, సర్పంచ్, దండిగుంట

చాలా ఆనందంగా ఉంది



మా గ్రామంలోని ఎస్సీకాలనీలో రామమందిరం నిర్మాణానికి టీటీడీ రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఇందుకోసం ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కృషి చేశారు. ఇప్పటికే మా గ్రామంలో ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేశాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– పత్తి వెంకటరమణారెడ్డి, సర్పంచ్, మునులపూడి గ్రామం

టీటీడీ చైర్మన్ సహకారం మరువలేనిది



టీటీడీ కోవూరు నియోజకవర్గంలో దాదాపు 29 రామమందిరాలను నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. వీటిని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నిర్మించేలా నిధులు మంజూరు చేసింది. రామమందిరాల నిర్మాణానికి సహకరిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. త్వరలోనే అన్నింటిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు

మైనార్టీలకు విరివిగా రుణాలు ఇవ్వాలి

ముత్తుకూరు: జాతీయ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు విరివిగా రుణాలు ఇవ్వాలని కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి జాన్ బర్లాను కోరినట్లు జాతీయ మైనార్టీ కమిషన్ సలహాసభ్యుడు అబ్దుల్ షఫీవుల్లా తెలిపారు. ఢిల్లీలో గురువారం జరిగిన వార్షిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి 15 సూత్రాల పథకాన్ని విస్తృతంగా అమలు చేయాలని కమిషన్ చైర్మన్‌ను కోరామన్నారు.

నేడు ఆస్తి పన్ను చెల్లింపునకు చివరి రోజు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెం ప్రజలు ఇంటి, కుళాయి పన్ను చెల్లింపునకు శుక్రవారం చివరి రోజు అని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో ఇంటి, కుళాయి పన్నుల వసూలు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బకాయిలు ఉన్న వారు ఇంటి, కుళాయి పన్నులను శుక్రవారం చెల్లించినట్లయితే వారికి వడ్డీ మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఇంటి పన్ను వసూలు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి